


రచన :
"చంద్రకాంత్"

అనువాదం :
"నీలకంఠం"

పార్వతి — మసకగా వెలుగుతూన్న లైటు వెలుతుర్లో, నిశ్శబ్దంగా మంచం మీద పడుకుని వ్యాకులతతో బాధ పడుతూవుంది. పాటకచ్చేరీనుంచి యిప్పుడే తిరిగివచ్చింది. యవ్వనంలోవున్న ఒక సన్యాసి — ఆమె కోసం చూసి-చూసి, విసుగెత్తి ఇంతకుముందే, నిద్రపోయాడు. కానీ ఆమె యింకా మేలుకునే—జరిగిపోయిన జీవిత ఘట్టాల్లోని అవమానాల్నీ—పరాభవాల్నీ గురించి బాధ పడుతూ ఆలోచిస్తూ వుంది. ఆమె దృష్టిలో మాటి మాటికీ 'సత్యం' కనబడుతున్నాడు

ఇవాళ సాయంకాలం ఆమె భగవద్గీతన్ని గానం చేస్తుండగా —, వినేందుకువచ్చిన ఆజనంలోంచి—దూరంగా ఒక బక్క-పలచటి మనిషిలేచి,—"చాలు. యిక సంగీతం అపు! నువ్వు గాయకురాలివి కాదు. నువ్వు

పాటకచ్చేరీల చాటున వ్యభిచారాన్ని వృత్తిగా సాగిస్తున్నావు.'' అని తిరిగి — దగ్గర్లోనే, కాషాయవస్త్రాలు కట్టుకున్న, సన్యాసిని చూసి — "పార్వతి మోసంలో పడి నువ్వు నాశనమై పోతున్నావు. నిన్ను, పార్వతి మోసం చేస్తూ వుంది. ఈకాషాయవస్త్రాలు ప్రపంచపు కళ్ళలో దుమ్ముకొడుతున్నయ్!" అని అన్నాడు.

తననూ, పార్వతినీ అవమానించడం వినడంతోనే, సన్యాసికి కోపం వచ్చింది. అతన్ని ఎవరూ పట్టుకోకుండా వున్నట్లయితే— సత్యాన్ని చంపేవాడే.

ఆ పాటకచ్చేరిలో వాకమూల నిలుచుని వున్న యిద్దరుసిక్కు సిపాయిలు సత్యం మీద పడ్డారు! ఇంకా కొంతమంది పెద్దమనుష్యులు కూడా సహాయంచేశారు. చూస్తూ—చూస్తూండగానే హాలంతా గోలతో నిండి పోయింది.

అంతవరకూ — పార్వతి స్టేజీమీద కూచుని—సత్యం వేపుచూస్తూవుంది. గోల ఎక్కువ కావడంచూసి — ఆమె లేచి నిలుచుని — "మీరంతా కూచోండి! ఈదురాత్ముణ్ని యిక్కడనుంచి పంపించేయండి." అని అన్నది.

ఆమె నోటినుంచి మాటలు బయటికి రావడంతోనే, సన్యాసి-సత్యాన్ని హాలులోంచి బయటికి గెంటేందుకు ప్రయత్నించాడు. సత్యంనోటివెంటా — ముక్కుంటా రక్తం కారింది. అయినప్పటికీ అతను—"పార్వతి దేశదిమ్మరి! దాన్ని కొట్టండి! అనవసరంగా నన్ను కొడతారేమిటి? దాన్ని శిక్షించండి! వ్యభిచారిణి" అని అరుస్తూనేవున్నాడు.

సన్యాసి అతని మాటలు వినిపించుకోలేదు. అతన్ని హాలుబయటికి యీడ్చుకుని పోయాడు.

పార్వతి—"రఘుపతిరాఘవ రాజారాం! పతితపావన సీతారాం—'' అని పాడుతూ-ఆ అస్త్రమహిమతో అక్కడున్న కొన్ని వేలమందిని వశపర్చుకోగలిగింది. ఆమె కంఠం వినడంతోనే జనమంతా కుక్కిన పేలవలె నిశ్శబ్దంగా ఉండిపోయారు.

పార్వతికి—మాటిమాటికీ ఈ దృశ్యమే కళ్ళకు కట్టినట్లవుతూంది. ఆమె కళ్ళకు 'సత్యం' కనిపిస్తున్నాడు. ఆకారణంతోనే, ఆమె ఆందోళనతో పక్కమీద అటూ— యిటూ పొర్లుతూ బాధపడుతూవుంది. తను వదిలి పెట్టినవాడు మళ్ళీ సిగ్గులేక ఎలా వచ్చాడు? హాల్లోని వాళ్ళంతా — 'సత్యం' మాటలు నమ్మినట్లయితే ఏమయేది —? తనొక హరిదాసి! పది సంవత్సరాలనుంచీ— నగరాలూ, పట్టణాలూ, పల్లెలూ తిరుగుతూ వుంది. తను పాట కచ్చేరి చేయని ప్రదేశమంటూ దేశంలో లేనేలేదు. ఆడవాళ్లంతా తనను చూసి దేవత ఈ రూపంలో అవతరించిందని పొగిడేవాళ్లు! తన కళ్లలో జ్యోతి, ముఖంలో అందం వుందని మగవాళ్లు అనేవారు. తను చేసిన దానధర్మాలకు లెక్కలేదు. దేవాలయాలు కట్టించేందుకు ఉచితంగా పాటకచ్చేరీలు చేసింది! కొన్ని అనాధాశ్రమాలకు దానం చేసింది. నిరాధారులైన ఆడపిల్లలకు పెళ్లి చేయించింది. తనకు కీర్తి — మానాభిమానాలూ, సిరిసంపదలూ వున్నయ్. ఇటువంటి జీవితాన్ని అనుభవించే తనమీద ఎవరికి అనుమానం కలుగు

తుంది....? తనవేపు కన్నెత్తి చూసేందుకెవరికి సాహసం వుంటుంది?

ఈ ఆలోచనా పరంపరల్లో — ఒక పక్కకు తిరిగి నిద్రపోవాలని ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. మేలుకుని ఆలోచిస్తూవుంది. కాదు—ఆలోచిస్తూ — మేలుకుని వుంది. చివరికామె హృదయంలో తుఫాను లేచింది. ఆ ఆలోచనా తుఫాను సాగరపు అలల్లో కొట్టుకుపోతూ వుంది.

♦ ♦ ♦

మొదటి అల వచ్చి, ఆమెను తన ప్రియుడి దగ్గరకు తీసుకుని వెళ్ళింది.

నిండు యవ్వనం తొణికిసలాడుతూన్న సమయంలో విధవగా మారి కూచుంది. విధవగా మారిన కొత్తరోజుల్లో, మెల్లిమెల్లిగా ప్రపంచానికి మొహం చూపిస్తున్నపుడు— అత్తవారింటికి దగ్గర్లోవున్న ఒక యువకుణ్ని చూడ్డం మొదలు పెట్టింది. ఆ యువకుని చూస్తూనే — నవ్వేందుకు తయారైంది. నవ్వుతూనే మాట్లాడింది. మాట్లాడుతూనే అతని గదిలోకి వెళ్ళింది. ఒకనాటి రాత్రి వీలుచూసుకుని—అతనితో లేచి పోయింది.

ఆమె తన యవ్వనాన్ని — సౌందర్యాన్నే, కాకుండా — అత్తవారింటి దగ్గర నుంచి, తీసుకుని వచ్చిన డబ్బు అతనికి అర్పించుకుంది. తన నగలుకూడా అమ్మి యిచ్చింది. ఇంతచేసినా — ఆఖరకు మద్రాసులో ఒక హోటలులో ఆమెను, విడిచిపెట్టి అతను కాళ్లకు బుద్ధి చెప్పాడు.

రెండో అలవచ్చి, ఆమెను తన పెంపుడు తల్లి దగ్గరకు తోసింది.

ఒకనాటి సాయంకాలం నిస్సహాయురాలై, పార్కులో కూచుని వున్నప్పుడు — ఒక వృద్ధురాలు వచ్చి తనను కూతురుతో సమానమనిచెప్పి ఓదార్చి, మెల్లిగా యింటికి తీసుకుని వెళ్ళింది. ఆ ముసలిది తనకు ఆధారం చూపించింది. ప్రోత్సహించింది. ఆఖరికి తనను మద్రాసులో — మౌంటు రోడ్డుకు దగ్గరగా మంచి డాబాలో వుంచింది. మంచి భోజనం ఇచ్చేది. సిల్కుచీరా. — జాకెట్టు కట్టుకునేందుకు అమర్చింది. చూస్తుండగానే వీటన్నిటి అర్థం తనకు తొందరగానే తెలిసిపోయింది. ఆ ముసలిది, ఎంతోమంది యవ్వనాన్ని, — శరీరాన్ని, నాశనంచేసి ఏమి తెలియనట్లు, బిక్కమొహంతో కళంకమైన మచ్చగల పట్టెమంచాన్ని తనగదిలో ఏర్పరిచింది —!

ఆ మంచం మీదకు, ప్రతిరోజూ వస్తూ—పోతూన్న ప్రియులను చూస్తుంటే, ఆ మంచాన్ని కాల్చి వేద్దామనిపించేది. ఆ ప్రియుల ముఖాన ఉమ్మివేద్దామనీ, తుచ్ఛురాలైన, ఆ ముసలిదాన్ని చంపుదామనీ, అనుకునేది. కానీ, ఈ ఆలోచనలతోపాటు తన భవిష్యత్ ఒక పెద్ద గోడలా ఎదురయేది. తన అసమర్థత కారణంగా — కొన్ని వందలమందితో పరిచయం కలిగింది. ఆ కారణంగా తను ఎక్కడికని వెళ్లగలుగుతుంది — తన్నెవరు ఆదరిస్తారు? ఎవరు తనని యింట్లో వుంచుకొని, భరించగలుగుతారు?

ఆడది యిల్లువొదిలి బయటకు రాగూడదేగాని, వచ్చింతర్వాత నీతి పరులూ, పెద్దలూ — సమాజమూ — లోకమూ— అంతా ఎదురై, జీవితాన్ని నాశనం చేసుకు

నేందుకు 'వృత్తి'ని చూపిస్తారుగాని, జారి పోయిన కాలును తిరిగి శుభ్రపరుచుకునేందుకు ఒప్పరు.

ఆ మంచం తాలూకు కీర్తి ప్రతిష్ఠల మచ్చ' ప్రతిరోజూ పెరుగుతున్న కొద్దీ ఆ మంచంమీద ఆమెకు విరక్తి కలగడంతోనే, ఒకనాటిరాత్రి సంపాదించిన వంద రూపాయలతో — మంచాన్నీ, ముసలి దాన్నీ, ఆయింటి గౌరవాన్నీ వొదిలి ఆమె మాయమైంది.

♦ ♦ ♦

మూడవ అలవచ్చి, తనను తన 'సంరక్షకుని' దగ్గర పడేసింది.

"అర్ధరాత్రపుడు, ఎవరికీ కనిపించకుండా — స్టేషనుకు వెళ్తుంటే, సందు మలుపులో 'డ్యూటీ' మీదున్న 'పోలీసు' కనిపించాడు. అదగ్గర్లో ఎక్కడన్నా దాక్కుందామనుకుంది. కానీ ఆపోలీసు తనవేపు రావడం చూసి దాగుండడం మంచిదికాదని, పోలీసుల్ని ప్రజలకు సేవచేయడానికే, ప్రభుత్వం నియమించిందనీ, ఆ పోలీసుతో తన కర్తకు జబ్బుగా వుందనీ, ఉదయం బండిని అందుకునేందుకు, స్టేషనుకు వెళ్తున్నాన'నీ చెపుదామనుకుంది. ఆ పోలీసు ఆమె దగ్గరకు వచ్చి, గుచ్చి గుచ్చి చూస్తుంటే —, ఒక్క మాటకూడా పెకిలి రాలేదు. ఆ ముప్పైయి రూపాయల జీతగాడు రాజ్యాన్ని ఏలుతూన్న వాడిలా కనిపించాడు. ఆమె ఏదో నేరస్థురాలిలా తలవంచుకుని నిలుచుంది.

ఆ పోలీసు యితర పోలీసులకంటే పెద్ద మనిషి! ఆమాటా — యీ మాటా అడిగి తెలుసుకుని, తానాకు బదులు, ఎంతో ప్రేమతో — తనను పక్కనున్న పార్కులోకి తీసుకుని వెళ్లాడు....

♦ ♦ ♦

నాలుగవ అలవచ్చి, ఆమెను 'స్వామి' దగ్గరకు విసిరి వేసింది —!

అనేక పట్టణాల్లో, తిరుగుతూన్నప్పుడు శ్రీరంగం లోని ఒక ధర్మశాలలో ఆమెకు 'స్వామి' దొరికాడు. ఆయనే ధర్మశాలకు యజమాని. అదీగాక ఆయనకు నూటఎనిమిది బిరుదులు వుండడం మూలాన, శ్రీరంగంలో ఆయన కెంతో పలుకుబడి వుంది.

ఆ స్వామిగారు ఎంతో ఆప్యాయంగా, ఆమెను ఆదరించి, ధర్మశాలలో ప్రత్యేకంగా ఒక గదిని యిచ్చాడు. కావేరినది వొడ్డున ఎంతమంది పుణ్యాంగనల స్మృతికి చిహ్నమైందో ఆగది! ఆమె ప్రవేశించడంతోనే గది — గదంతా కొత్తదైపోయింది!

ఒకనాటి రాత్రి ఆమె 'ద్రాక్షరసం' ఎక్కువగా తాగి—వొదలు తెలియకుండా—స్వామివారికి, 'రాధాదేవి విరహం' చక్కగా పాడి వినిపించింది. ఆ పాటకు స్వామివారు పిచ్చివాడై, ఆమె శరీరంలానే పాటకుకూడా వొళ్లుమర్చి, ఎంతో ప్రేమతో—"పార్వతీ! నువ్వు పాటలూ — హరికధలూ నేర్చుకున్నావంటే, ప్రపంచాన్నే తారుమారు చేయగలవు. నీ కంఠంలో మంత్రంవుంది. నీలో గొప్ప ఆకర్షణశక్తివుంది. నువ్వు తప్పకుండా భజన కీర్తనలు నేర్చుకో! మనిద్దరం తరిస్తాము —" అని చెప్పాడు.

ఆ అమూల్య సలహాను శిరసావహించి ఆమె స్వామిదగ్గరే పాటలు నేర్చుకుంటూ, రెండు మాసాలలోనే, కథలూ —పాటలూ నేర్చుకుంది! పొద్దస్తమానం, అదేపని; అన్ని హంగులూ ఏర్పడ్డాక స్వామి, ఆమెకు కాషాయ వస్త్రాలు యిచ్చారు.

శ్రావణమాసపు రోజులు. అప్పుడప్పుడూ మబ్బులు వేస్తున్నయ్! శ్రీరంగమంతా యాత్రికులతోనూ, కాముకులైన స్త్రీపురుషులతోనూ, — గందరగోళంతోనూ నిండిపోయింది.

స్వామిగారి పరివారం వల్లనైతేనేమి — వారి పలుకుబడి వల్లనైతేనేమి, శ్రీరంగనాథుడి ఆలయంలో పాటకచేరీ ఏర్పాటైంది. కొందరు పాటలు వినేందుకు, కొందరు హరిదాసిని చూసేందుకు వచ్చారు. జనమంతా ఆమె పాటకు ముగ్ధులయారు! కాషాయవస్త్రాల్లోని ఆ నిండు శరీరమూ, ఇరవై అయిదేండ్ల యవ్వనమూ, — స్వామి తినిపించిన పదార్థాల బలమూ తాగించిన ద్రాక్షరసం కలిగించిన కృత్రిమశక్తీ, రాటుతేలిన ఆ కంఠస్వరం అందర్నీ ఆకర్షించినయ్! అందరి హృదయాలనూ పార్వతి కదను తొక్కించి, అయస్కాంతంలా ఆకర్షించింది.

♦ ♦ ♦

అయిదో అలవచ్చి ఆమెను స్నేహితుడి దగ్గరకు తోసింది.

ఆ ధర్మశాలకు ఎదురుగావున్న గదిలో అందమైన యువకుడు వున్నాడు. ఆ యువకుడు ఆమెను పరకాయించి, చూసి — నిట్టూర్పులు విడిచేవాడు. ఆ యువకుడి అవస్థ చూడడంతోనే — ఆమె హృదయంలో సానుభూతి ఏర్పడింది. దాని ప్రతిఫలమే ఆ యువకుడి గుడ్డి యవ్వనంతో తాను ఆడుకుంది. చందాల రూపేణా,— బహుమానాల రూపేణా వచ్చిన డబ్బంతా అతని కింద ఖర్చు పెట్టింది. అతనికోసం రాత్రిం బవళ్లు ఎదురు తెన్నులు చూసేది. ఆ ధ్యాసనుంచి ఆమె తప్పుకోలేక పోయేది. చివరకు ఆ ముసలి స్వామివారినుంచి తప్పించుకుని పోయి — ఆ యువకుణ్ని పెళ్ళి చేసుకుంది.

♦ ♦ ♦

ఆరవ అలవచ్చి ఆమెను హరిదాసిగా మార్చింది.

గృహజీవితంమీద ఆమెకు అనుకోనంత తొందరలోనే రోత పుట్టింది. అందులో ఆమెకు వూహించినంత రుచి కనిపించ లేదు. మనసంతా తిరిగి స్వాతంత్ర్యాన్ని కోరుతూ, తిరుగుబాటు చేసింది. సంసార నిబంధనల్నుంచి దూరంగా — వుందేందుకు ఎదురు తిరిగేది. స్వాతంత్ర్యమే లేని సాంసారిక జీవిత బంధనాల్లోంచి ఎలా తప్పుకుని పోదామా, అనే దిగులుతో, ఆలోచనలతో, కుశించిపోయింది. పీరసించిన జీవితాన్ని ఆనందమయం చేసేందుకు, ఆమె మళ్ళీ పాటలు 'పాడడం మొదలు పెట్టింది. కానీ — ఆ కంఠంలో మునుపటిలా మృదుత్వం లేదు. వీణానినాదంలాంటి కమ్మని స్వరం లేకపోవడమటుంచి, అఖరికి 'హాయి'కూడా లేదు. గొంతులోంచి

సరైన స్వరం వచ్చేదేకాదు. విసిగిపోయి ఆఖరికి 'భగవద్గీత' మొదలు పెట్టింది.

ఆ యువకుడు — హిందీ సంస్కృతంలో బాగా ఆరితేరిన వాడవడం చేత, రాత్రింబగళ్ళు కష్టపడి ఆమెకు తొందర్లోనే ఆ భాషలుకూడా నేర్పి హరిదాసిగా తయారు చేశాడు. వెంటనే ఆమె నగరం—నగరం — పట్టణం — పట్టణం తిరిగింది.

♦ ♦ ♦

ఏడవ అల — ఎనిమిదవ అల — తొమ్మిదవ అల — పదవ అల— యింకా చిన్నా — పెద్ద అలలు ఎన్నో లేచినయ్. ఈ అలల్లో కొన్ని ఆమెను యువకుల దగ్గరకు తీసుకుని వెళ్ళినయ్. కొన్ని అలలు యువకుల్ని తనదగ్గరకు తీసుకొచ్చినయ్. అలలు వస్తున్నయ్; పోతున్నయ్. ఆ తరువాత వూహించలేని పెద్ద అల వొకటివచ్చి, తనను 'సత్యం' దగ్గరకు లాక్కుపోయింది.

ఒకనాడు 'తిరుపతి' దేవాలయంలో కథ చెపుతుండగా — పురుషోచిత సౌందర్యం గల సత్యం అందం ఆమెను ఆకర్షించింది. అతన్ని తన మాయలోకి లాక్కునేందుకెంతో ప్రయత్నం చేసింది. ప్రయత్నం కొనసాగక పోయేప్పటికి, తన దగ్గరవుండే ముసలిదాన్ని — అతని వెనకాల బాణంలా వదిలించి. ఆ ముసలిది నేర్పరి. చాలా కాలంనుంచీ, పార్వతివద్ద, జీతానికుంటూ వుంది. పార్వతికోరే యువకుల్ని తీసుకు రావడమే ఆమెపని.

ఆ ముసలిది సత్యం మనసు విరగదీసింది. అతను ఆమె వెనకాలే పార్వతి బసకు వచ్చాడు. పార్వతి అతన్ని లేవిపోని చిక్కుల్లో యిరికించి తన బానిసగా చేసుకుంది.

సత్యం తనవూహల్లోకి రావడంతోనే ఆమెకు నవ్వు వచ్చింది. ఆమె తన మనసులోనే — "నేను — సత్యం తాలూకు బంగారు రోజుల్లోని యవ్వనాన్ని అపహరించి, అతన్ని నాశనంకూడా చేశాను. నాతోవున్న ప్రతి ఒక్కప్రియుణ్నీ ఎంతోయిదిగా ప్రేమించాను. నాఆత్మలా, విశ్రాంతి యిచ్చాను మంచి భోజనం —సిల్కుబట్టలూ — విదేశీ సారాయి — ఖరీదైన విలాస వస్తువులు ఎన్నో యిచ్చాను. తీరని కోరికల్ని ఎన్నో తీర్చాను. జీవితమంతా నీరసించిపోయి, వుసూరుమంటూ కోరికలతో, ఆవేశాలతోబాధపడే ప్రతివాడికీ, వాళ్ళ జీవితానికి కొంత ఆనందాన్ని కలిగించాను. నాదగ్గరకు వచ్చిన ప్రతి ప్రియుడికీ, రాజ్యం ఏలుతూన్న రాజులకు, రాణులు కూడా యివ్వలేనంత భోగాన్ని, ఆనందాన్ని విలాసాన్నిసుఖాన్ని, తీరని కోరికల్ని, వాంఛల్ని తీర్చి, హృదయ సింహాసనానికి, పట్టాభిషిక్తుల్నిగా తయారు చేశాను...." అని అనుకుంది.

ఈభావాల్లో, ఆవులించి, ఆమె, పక్కనే నిద్రపోతూన్న యువక సన్యాసివేపు ప్రేమతో, చూసింది. ఆమె హృదయం మెల్లిమెల్లిగా కొట్టుకుంటూవుంది. శరీరంలో హాలాహలంలా వేడివేడి అలలు ఉరుకుతూన్నయ్: ఆమె చెయిచాపి సన్యాసిని లేపి — 'ఇవాళకూడా — అలానే నిద్రపోతున్నావా? నేను ఎప్పటి నుంచీ మేలుకొంచున్నానోతెలుసా—?" అని అన్నది.

సన్యాసిలేచి, లైటు పెద్దది చేసి, సూటు కేసులోంచి రెండు చిన్నగ్లాసులు, ఒక పెద్ద సీసాతీసి, — నవ్వుతూ పార్వతి మంచం మీదకు వచ్చి కూచున్నాడు.

గ్లాసులు పోట్లాడుకుని, ఖాళీ అయినయ్. మళ్ళీ కలుసుకుని ఖాళీ అయినయ్; చివరకు సీసాఅంతా ఖాళీఅయిపోయింది.

ఖాళీసీసాలోనిరక్తం, పార్వతిముఖంమీద 'తళుక్కు' మని మెరిసింది. ఆ ముఖంమీద అందం ఎక్కువైంది. ఆకళ్ళల్లో జ్యోతి వెలిగింది....,

ఆమె....ఆ దేవి సగంతెరిచిన కళ్ళతో, మదించిన యువకుడైన ఆ సన్యాసివేపు, తీగ ల్లాంటి చేతులుచాపి దగ్గరకు లాక్కుంటూ, మంచంమీద వాలిపోయింది....

పెద్దగా వెలుగుతూన్న లైటు ఆరిపో యింది. ఆ గదికీ — బయటి ప్రపంచానికీ మధ్య, దళసరి చీకటి పరదాని ప్రకృతి కలిపించింది.

